పొదుపే భవిష్యత్తుకు భరోసా : అదనపు కలెక్టర్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

జగిత్యాల, ఫిబ్రవరి 28 : ప్రతి ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణతో కూడిన పొదుపే భవిష్యత్‌కు భరోసనిస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు దేశవ్యాప్తంగా 'ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు' నిర్వహిస్తున్న తరుణంలో జిల్లా లీడ్ బ్యాంక్ కార్యాలయం ఆధ్వర్యంలో కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికీ తమ ఆదాయ వ్యయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎదుటి వారిని చూసి ఆడంబరాలకు పోయి తమ ఆర్థిక స్థోమతకు, ఆదాయానికి మించి ఖర్చులు చేస్తున్నారని తద్వారా వాటి కోసం అప్పులు చేస్తూ అప్పుల ఊబిలో కూరుకుపోయి సతమతమవుతున్నారన్నారు. కాగా, ప్రతి వ్యక్తి తమ కుటుంబ బడ్జెట్ రూపకల్పన చేసుకోవాలని సూచించారు. తద్వారా తాము చేసే ఖర్చులు తగ్గించి పొదుపు చేయడానికి దోహదపడుతుందన్నారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌కుమార్ , జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిణి సత్యమ్మ, బీసీ సంక్షేమ అధికారి సునీత, జిల్లా ఎఫ్ఎల్సీ కోట మధుసూదన్, వివిధ శాఖల మహిళా ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్ ఏర్పాట్లు సజావుగా నిర్వహించాలి

రంజాన్ ఏర్పాట్లు సజావుగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత ఆదేశించారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, నిరంతర విద్యుత్ సరఫరా, లా అండ్ ఆర్డర్, శాంతి భద్రతలు, ట్రాఫిక్ నిబంధనలు ఈద్గాల వద్ద ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అత్యవసర సేవల కోసం టోల్ ఫ్రీ నం 96662 34383 ఏర్పాటు చేశారు.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 28 : జిల్లాలోని ఫర్టిలైజర్ షాపులు, రైతు బజార్, సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, జిల్లా వ్యవసాయాధికారి రాంచందర్ తనిఖీలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ధర్మపురి రోడ్‌లోని రైతుబజార్‌లో ఎఫ్‌సీవో నిబంధనలకు విరుద్ధంగా ఈపీవోఎస్ మిషన్ పనిచేయనందున సంబంధిత డీలర్ ఫర్టిలైజర్ లైసెన్స్‌ను రద్దు చేసినట్లు తెలిపారు. అదే రోడ్‌లోని రైతు సేవా కేంద్రంలో 46 బస్తాలు తేడా రావడంతో డీలర్ లైసెన్స్‌ను రద్దు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో ఎక్కడైనా ఫర్టిలైజర్ డీలర్స్ ఎలాంటి అవకతవకలకు పాల్పడినా చర్యలు తీసుకుంటామన్నారు.

నూతన కార్యవర్గం

జగిత్యాల టవర్ సర్కిల్, ఫిబ్రవరి 28 : జగిత్యాల జిల్లా ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ల సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు నిర్వాహకులు తెలిపారు. అధ్యక్షుడిగా పూటూరి ప్రదీప్, ప్రధాన కార్యదర్శిగా మన్నె భాస్కర్, కోశాధికారిగా గొల్లపల్లి శ్రీధర్, జాయింట్ సెక్రటరీగా పుల్లూరి దేవయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలను సజావుగా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఎల్‌పీజీ డీలర్ల సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి హరికృష్ణ రావు, ప్రధాన కార్యదర్శి హరిచరణ్ రావు, పెద్దపల్లి జిల్లా ఎల్‌పీజీ డీలర్ల సంఘం అధ్యక్షులు తిరుకోవెల ప్రవీణ్ కుమార్, రామ్‌రెడ్డి, కొండపల్లి సతీష్‌కు నూతన కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపింది.

ఉద్యాన శాఖ అధికారికి అదనపు బాధ్యతలు

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 28 : కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల మేరకు జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారిగా అదనపు బాధ్యతలు జిల్లా వ్యవసాయాధికారి సీహెచ్ రాంచందర్‌కు అప్పగించినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో జిల్లా ఉద్యాన అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న జీ దేవప్రసాద్‌ను కలెక్టర్ హైదరాబాద్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ కార్యాలయానికి సరెండర్ చేశారు. సీహెచ్ రాంచందర్ శుక్రవారం జిల్లా ఉద్యాన శాఖాధికారిగా బాధ్యతలు తీసుకున్నారు.

యూరియా అందుబాటులో ఉంచాలి

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 28 : ప్రభుత్వం రైతులకు యూరియాను అందుబాటులో ఉంచాలని బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు నత్తి రాజ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రైతులు యూరియా కోసం సహకార సంఘాల వద్ద బారులు తీరి, పడిగాపులు కాస్తున్నా యూరియా సంచులు దొరకడం లేదు. వరి పంట, మక్కజొన్న పొట్టదశకు వస్తున్న క్రమంలో యూరియా లేకపోవడంతో పంట నష్టపోయే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం రైతులకు యూరియాను అందుబాటులో ఉంచి ఆదుకోవాలన్నారు.

ఫర్టిలైజర్స్ దుకాణాల్లో తనిఖీలు

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 28 : జిల్లాలోని జగిత్యాల అర్బన్, ఎండపల్లి మండలంలోని ఫర్టిలైజర్స్ దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి రాంచందర్ తనిఖీ చేశారు. జగిత్యాల అర్బన్‌లోని ఏఆర్ఎస్‌కేలో 520 బస్తా యూరియా నిల్వ ఉండగా, ఎండపల్లిలోని ఉమామహేశ్వరలో 450 బస్తాలు, రాజరాజేశ్వర ఫర్టిలైజర్స్‌లో 450 బస్తాల యూరియా నిల్వ ఉన్నట్లు తెలిపారు. శుక్రవారం వరకు 38 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, 38,205 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసినట్లు తెలిపారు. అవసరం ఉన్న రైతులకు సరిపడా యూరియాను అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

లింగాపూర్‌లో పొరహక్కుల దినోత్సవం

పెగడపల్లి, ఫిబ్రవరి 28: లింగాపూర్ గ్రామంలో శుక్రవారం రెవెన్యూ అధికారులు పొరహక్కుల దినోత్సవం నిర్వహించారు. దీనిలో పాల్గొన్న ఎంపీవో మహేందర్ మాట్లాడుతూ, అంటరాని తనం నిర్మూలనకు అందరూ కృషి చేయాలన్నారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వాటి నిరోధానికి అందరు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జమున, పోలీస్ హెడ్ కానిస్టేబుల్ రవీందర్, పంచాయతీ కార్యదర్శి లావణ్య, అంగన్‌వాడీ టీచర్లు సుహాసిని, రూప, రమ, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా కల్పించడం సంతోషకరం

కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, ఫిబ్రవరి 28 : జర్నలిస్టులకు ప్రమాద బీమా కల్పించడం సంతోషకరమని కలెక్టర్ బీ సత్యప్రసాద్ అన్నారు. జర్నలిస్టులపై దాడులకు సంబంధించిన కమిటీని పునరుద్ధరించాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సత్య ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం నారగౌని ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో యూనియన్ అందజేస్తున్న ఉచిత ప్రమాద బీమాపత్రాలను సభ్యులకు కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జర్నలిస్టులకు టీఎస్‌జేయూ ఇస్తున్న రూ.5 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా ఇవ్వడం సంతోషకరమన్నారు. విధి నిర్వహణలో భాగంగా ఎంతో మంది జర్నలిస్టులు ప్రమాదాలకు గురై ఇబ్బందులు పడుతుంటారు. ఆ సమయంలో వారికి ప్రమాద బీమా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. టీఎస్‌జేయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్‌కుమార్ మాట్లాడుతూ, జర్నలిస్టులకు గల సమస్యలను, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో జర్నలిస్టులకు మొదట ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌జేయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అవునూరి సంపత్, కోరుట్ల నియోజకవర్గ కమిటీ గౌరవ అధ్యక్షుడు దీకొండ మురళి, అధ్యక్షుడు జోరిగే శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్ ఖాన్, కోశాధికారి ఓంకారి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి కోయాల్కర్ నరేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బోడ దివాకర్, మీడియా ఇన్‌చార్జి నన్నపురజ్ రవిరాజ్, ఈసీ మెంబర్లు పండిత్ రాజేందర్, స యద్ ఫిరోజ్, గట్ల శ్రీనివాస్, దూది గణేశ్, సభ్యులు మద్దెనపల్లి నగేశ్, బెజ్జరాపు శ్రీకాంత్, అశోక్, బెజ్జరాపు శ్రీనివాస్, రవీందర్, సుద్దాల హరీశ్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలపై అధికారులతో సమావేశం

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 28 : జిల్లా కేంద్రంలోని ఇంటర్మీడియట్ ఎడ్యూకేషన్ కార్యాలయంలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్‌కు మార్చి 5న నిర్వహించనున్న ఇంటర్‌మీడియట్ పబ్లిక్ ఎగ్జామినేషన్ 2025 పరీక్షలకు సంబంధించి పరీక్షల కన్వీనర్ బీ నారాయణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 28 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 14 సెంటర్స్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, 1 మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో, 13 ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 7073, ద్వితీయ సంవత్సరంలో 7377 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. గతేడాది లాగే పరీక్షల నిర్వహణ సమర్థవంతంగా చేయాలని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ఉదయం 8.30 గంటలకు చేరుకోవాలని సూచించారు. వివరాల కోసం జిల్లా ఇంటర్ ఎడ్యూకేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నంబర్ 9440361255, 8500470642ను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు వై రమేశ్ బాబు, కే గంగాధర్ పాల్గొన్నారు.

ఎస్జీటీలకు శిక్షణ

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 28 : జిల్లా కేంద్రంలోని వీక్లీబజార్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డీఎస్సీ 2024 ద్వారా నూతనంగా నియామకమైన ఎస్జీటీలకు జిల్లా స్థాయిలో వృత్యంతర శిక్షణను శుక్రవారం జిల్లా విద్యాధికారి కే రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్తగా నియామకమైన ఉపాధ్యాయులందరూ నూతన ఉత్తేజంతో పనిచేయాలన్నారు. శిక్షణలో ఇచ్చే అంశాలను ఎఫ్ఎల్ఎన్, పాఠశాల నిర్వహణ, పాఠశాలలో ఉంచాల్సిన రికార్డుల నిర్వహణపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు జయంత్, ఉమేశ్, మహేశ్, అశోక్‌కుమార్, విజయ్‌కుమార్, రమేశ్, ప్రవీణ్, అజీమ్, ప్రధానోపాధ్యాయుడు విజయలక్ష్మి, డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ కొక్కుల రాజేశ్ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మల్లాపూర్, ఫిబ్రవరి 28 : ఈ నెల 3న మల్లాపూర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని స్థానిక శ్రీ వాసవీమాత ఆలయంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్‌క్లబ్ మాజీ రీజియన్ చైర్మన్ శివ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో స్థానిక లయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో లయన్స్‌క్లబ్ సేవలను మరింత విస్తృతంగా అందిస్తామన్నారు. కార్యదర్శి సుతారి రాజేందర్, కోశాధికారి మార్గం రాజేశ్వర్, మాజీ అధ్యక్షుడు రుద్ర రాంప్రసాద్, సంజీవ్, ఏఎంసీ డైరెక్టర్ నూతిపల్లి రాజం పాల్గొన్నారు.

చలో ఢిల్లీ విజయవంతం చేయాలి

జగిత్యాల, ఫిబ్రవరి 28 : మార్చి 28న ఏఐయూసీ చేపట్టిన చలో డిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్టేట్ కౌన్సిల్ మెంబర్ మాడిశెట్టి కిరణ్ పిలుపునిచ్చారు. జగిత్యాలలో శుక్రవారం చలో పార్లమెంట్ పోస్టర్ రిలీజ్ చేశారు. జిల్లా సెక్రటరీ రామిల్ల రాంబాబు, సలహా దారు మునిగురి హన్మంత్, సహాయక కార్యదర్శి మల్లారపు నర్సయ్య, ఉపాధ్యక్షుడు మామిడి రాజన్న, క్యాషియర్ పూదరి మల్లేశం, ప్రవీణ్, పనగంటి మల్లారెడ్డి, సతీష్ రావు, వెన్న మహేశ్, అందె ప్రశాంత్ పాల్గొన్నారు.

వైభవంగా సోమేశ్వరస్వామి రథోత్సవం

కనక సోమేశ్వరస్వామి రథాన్ని లాగుతున్న శివదీక్షాపరులు, భక్తులు

మల్లాపూర్, ఫిబ్రవరి 28 : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలకేంద్రంలోని శ్రీ కనక సోమేశ్వర స్వామి జాతర ఉత్సవాలు వైభవంగా జరిగాయి. శుక్రవారం ఉదయం ఆలయం స్వామి వారి నామస్మరణలతో మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకుడు బల్యపల్లి ప్రభాకర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సోమేశ్వరస్వామి శివ దీక్షాపరులు, భక్తులు కలిసి సోమేశ్వరస్వామి రథోత్సవం నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున్న భక్తులు తరలివచ్చారు. ఈ వేడుకలకు భక్తుల సౌకర్యార్థం దేవాదాయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని వసతులను కల్పించారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి

కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి, ఫిబ్రవరి 28 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు వెళ్లినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ సూచించారు. శుక్రవారం మెట్‌పల్లి పట్టణంలోని జ్ఞానోదయ డిగ్రీ కళాశాల, నిఖిల్ భరత్ కాన్వెంట్ ఉన్నత పాఠశాలలో సీవీరామన్ జయంతి, సైన్స్ దినోత్సవం సందర్భంగా సైన్స్‌ఫెయిర్‌ను నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ, డిగ్రీ చదివి పట్టాలు సాధించడమే లక్ష్యం కాకుండా ఉన్నత లక్ష్యాలు ఎంచుకుని కొత్త ఆవిష్కరణలతో సాంకేతిక విప్లవం వైపు అడుగులు వేయాలని, సరికొత్త ఆలోచనలతో ముందుకు వచ్చే విద్యార్థులకు తాను ఎప్పుడూ తోడ్పాటును అందిస్తానని హామీ ఇచ్చారు. సైన్స్‌ఫెర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ప్రేమ్‌కుమార్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఆయా కార్యక్రమాల్లో కళాశాల కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, నిఖిల్ భరత్ కాన్వెంట్ హైస్కూల్ కరస్పాండెంట్ బీవీ మహర్షి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి

డీఆర్డీవో రఘువరన్

రాయికల్ : ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డీఆర్డీవో

రాయికల్, ఫిబ్రవరి 28 : ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని డీఆర్డీవో రఘువరన్ సూచించారు. మండలంలోని వీరాపూర్ గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో జరుగుతున్న ఫారంఫండ్, హరితవనాలు, నర్సరీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం కూలీలను గ్రూపుల వారీగా పిలిచి మస్టర్ రోల్ కాల్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో 50 మందికి తగ్గకుండా ఉపాధి హామీ పనులకు వచ్చేలా పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నాయని, పని ప్రదేశంలో కూలీలకు కనీస వసతులు కల్పించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో దివ్య, పంచాయతీ కార్యదర్శి స్వర్ణ, టెక్నికల్ అసిస్టెంట్ వీణారాణి, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణ్, కారోబార్, ప్రశాంత్, ఉపాధిహామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై మహిళలకు అవగాహన

మల్లాపూర్, ఫిబ్రవరి 28 : మండలకేంద్రంలోని స్థానిక సెర్ప్ కార్యాలయంలో శుక్రవారం మహిళలకు ఆరోగ్యం, పౌష్టికాహారంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో రఘువరన్ మాట్లాడుతూ మహిళలు పోషకాలు నష్టపోకుండా వంటలు చేసే పద్ధతులపై తప్పనిసరిగా అవగాహన ఉండాలని, పిల్లల పోషణ, చేతుల పరిశుభ్రత, కాలంకు అనుగుణంగా తినే ఆహారాలు తదితర అంశాలపై మహిళలకు వివరించారు. ఏపీఏం దేవరాజ్, సీసీలు రమేశ్, లక్ష్మీరాజం, స్రవంతి, మండల సమాఖ్య అధ్యక్షురాలు ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శుల సంఘం మండలాధ్యక్షుడిగా నారాయణరెడ్డి

నారాయణరెడ్డి

మల్లాపూర్, ఫిబ్రవరి 28 : మల్లాపూర్ మండల సీనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం మండలాధ్యక్షుడిగా నోముల నారాయణరెడ్డి ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన సంఘ సమావేశంలో నూతనంగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా గోరుమంతుల మురళి, ప్రధానకార్యదర్శిగా రంజిత్‌కుమార్, కోశాధికారిగా బాలచందర్, సహాయ కార్యదర్శిగా అబ్దుల్ మోబీన్‌తో పాటు, పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా మండలాధ్యక్షుడిగా ఎన్నికైన నారాయణరెడ్డి మాట్లాడుతూ, పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు.

యాదవ సంఘం అధ్యక్షుడిగా రాజు

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 28 : మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ గ్రామంలోని యాదవ సంఘం నూతన అధ్యక్షుడిగా లక్కం రాజు ఎన్నికయ్యారు. శుక్రవారం యాదవ సంఘ సభ్యులు సమావేశమై నూతన అధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఇటీవల మల్లన్న స్వామి జాతరకు రూ. 3.07 లక్షల ఆదాయం రాగా, రూ. 2.95 వ్యయమైనట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు లక్కం మహిపాల్ తెలిపారు.

ఆరోగ్య పరిరక్షణలో ఐఎంఏ కృషి అభినందనీయం

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 28: ఆరోగ్య పరిరక్షణలో ఐఎంఏ కృషి అభినందనీయమని జగిత్యాల డీఎస్పీ రఘుచంధర అన్నారు. శుక్రవారం ఐఎంఏ హాల్లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ అతిథిగా డీఎస్పీ హాజరయ్యారు. 33 మంది వైద్య నిపుణులు, వైద్య విద్యార్థులు, యువకులు కర్తదానం చేశారని, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ గూడూరి హేమంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎ కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి కోటగిరి సుధీర్ కుమార్, డాక్టర్ విజయరామిరెడ్డి, డా. రఘుపసతి రావు పాల్గొన్నారు.

ప్రజలకు సేవలందిస్తేనే ఉద్యోగులకు గుర్తింపు

కథలాపూర్, ఫిబ్రవరి 28 : ప్రజలకు సేవలందిస్తేనే ఉద్యోగులకు గుర్తింపు ఉంటుందని జిల్లా వైద్యాధికారి ప్రమోద్ పేర్కొన్నారు. కథలాపూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పీహెచ్ఎన్‌గా పనిచేసిన లూసి ఉద్యోగ విరమణ సన్మాన సభ శుక్రవారం నిర్వహించారు. పీహెచ్ఎన్ సేవలను అధికారులు కొనియాడి, శాలువాలతో సన్మానించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, పీవో శ్రీనివాస్, వైద్యాధికారులు సింధూజ, రజిత, రచన, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, రాజన్న, విజయ్ పాల్గొన్నారు.

రాయికల్ మున్సిపల్ కమిషనర్‌గా మనోహర్ గౌడ్

రాయికల్, ఫిబ్రవరి 28 : రాయికల్ మున్సిపల్ కమిషనర్‌గా మనోహర్ గౌడ్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. రాయికల్లో కమిషనర్‌గా పని చేసిన జగదీశ్వర్ గౌడ్ నిర్మల్ మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. కొన్ని రోజులు మున్సిపాలిటీ మేనేజర్ వెంకటికి అదనపు బాధ్యతలు అప్పగించారు. కాగా, ఖానాపూర్ మున్సిపాలిటీ కమిషనర్‌గా పని చేస్తున్న మనోహర్ గౌడ్ రాయికల్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు.

కుక్కల దాడిలో బాలుడికి తీవ్రగాయాలు

కథలాపూర్, ఫిబ్రవరి 28 : సిరికొండలో కందరి శ్రీయాన్స్ మూడేళ్ల బాలుడిపై శుక్రవారం కుక్కలు దాడి చేయడంతో తీవ్రగాయాలపాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. బాలుడు ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా, కుక్కలు దాడి చేశాయన్నారు. బాలుడికి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించినట్లు బంధువులు తెలిపారు.

బుగ్గారం జడ్పీహెచ్ఎస్‌లో మీట్ ది సైంటిస్ట్

ధర్మపురి,ఫిబ్రవరి 28 : బుగ్గారం జడ్పీహెచ్ఎస్‌లో మీట్ ది సైంటిస్ట్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమెరికాలో ఉంటున్న పొలాసకు చెందిన శాస్త్రవేత్త డా. జన్మంచి కృష్ణమూర్తి విద్యార్థులతో అన్‌లైన్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా రీసైక్లింగ్ ఉపయోగం, పరసరాల శుభ్రతలో విద్యార్థుల పాత్ర అనే విషయాలపై మాట్లాడారు. వ్యర్థ పదార్థాలను తిరిగి ఏ విధంగా ఉపయోగించవచ్చనే అనే అంశంపై తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన టీఎన్జీవో నాయకులు..

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 28 : కలెక్టరేట్ కార్యాలయంలో నూతన పరిపాలన అధికారిగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న షాదాబ్ హకీమ్‌ను టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు మిర్యాల నాగేందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట పూర్వ పరిపాలనాధికారి హనుమంతరావు, టీఎన్జీవో నాయకులు మహమూద్, సాహెబ్ బాబు, రవీందర్, రవికుమార్, సుగుణాకర్, అశోక్‌కుమార్, మునీందర్, తిరుపతి, శైలజ, రాజయ్య, నాగరాజు, కుమారస్వామి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

- విద్యాలయాల్లో ఉత్సాహంగా క్విజ్, వక్తృత్వ పోటీలు
- ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

ధర్మపురి : విద్యార్థులు తయారు చేసిన పరికరాలను పరిశీలిస్తున్న ఎంఈవో

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 28 : జగిత్యాల మండలం మోతె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి కే రాము మాట్లాడుతూ, విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలన్నారు. విజ్ఞాన శాస్త్ర మెలకువలను నేర్చుకొని భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. 1928 సంవత్సరంలో డాక్టర్ సర్ సీవీ రామన్ ఆవిష్కరించిన రామన్ ఎఫెక్ట్ గుర్తు చేసుకుంటూ దేశవ్యాప్తంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. అనంతరం మెట్‌పల్లిలో నిఖిల్ భారత్ కాన్వెంట్ స్కూల్ పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్‌ఫేర్‌లో విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, సైన్స్ క్విజ్, చిత్రలేఖనం, పుస్తక ప్రదర్శన, పరికరాల ప్రదర్శన, ప్రయోగాలు, ప్రాజెక్టుల ప్రదర్శన వంటి శాస్త్రవేత్తలపై ఉపన్యాసాలు, విజ్ఞానమేల వంటి కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్, ఆయా మండలాల మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

కోరుట్ల, ఫిబ్రవరి 28 : విద్యార్థులు చదువుతో పాటు